
# స్వైర-గౌరి





## కొలకలూరి


“కథలో మీ హృదయం వ్యక్తమయింది' కాగితాల కట్ట ఆక్తరుస్నిసా బేగంకి అందించాడు సుందర రామమూర్తి.

'మీ మనస్సు ఎటు మొగ్గివుందో స్పష్టంగా తెలుసు కొన్నాను,' కళ్ళలోకి చూస్తూ చెప్పాడు. ఆడమ్స్ ఆ కథ అంతకుముందే చదివాడు.

ముగ్గురూ యూనివర్సిటీ స్టూడెంట్స్.




రాత్రి ఎనిమిది గంటలప్పుడు నౌబత్ పహాడ్‌మీద కూర్చునివున్నారు. హైద్రాబాద్‌లో.

రచయిత్రి అత్తరుసీసాబేగం విద్యుద్దీపాల వెలుతురు తేలికగా, విలాసంగా కూర్చున్న ఆమె బఠానీలు ఒక్కొక్క గింజా తింటూవుంది.

'అంటే ఏమిటి?' బఠాణీగింజ కొరకి ఇద్దరినీ చూచి అడిగింది.

'నేను చెపనక్కర్లేదు. కథ హృదయం మీకే తెలుసు' ఆడమ్స్.

'అంతకుముందు తెలియకపోతే కథ పురొక్కసారి మీరే చదువుకొంటే మీ మనస్సు ఎటు మొగ్గిందో మీకే తెలుస్తుంది సుందరరామమూర్తి

'అయితే చదువుతాను'

బఠానీలుకొరుకుతూ మొదలుపెట్టింది.

చిలగడదుంపమీద బొప్పుల్లాగా వున్నాయి కొండలు. పచ్చటి చెట్లలో వున్న పర్వతప్రాంతం ఆకాశానికి ఆకుపచ్చరంగు అచ్ఛాదించింది.

నిశ్శబ్దిగా వున్న లోయలో ఆకాశం ఉరిమినట్లు ధ్వని, ప్రతిధ్వనులు. కొండ పగిలి పెళ్ళలులేచి చెట్లుమీదపడి కొమ్మలు విరగ్గొట్ట ఆకులు చితగ్గొట్టి నేలమీద పడితే పనివాళ్ళు పగలగొట్టి చిన్నచిన్న రాళ్ళు పేరుచేస్తున్నారు.

అక్కడ పనిచేయిస్తున్న వ్యక్తి రాంకోటి. ఆ రాళ్ళతో వెళుతున్న లారీ పర్వతప్రాంతంలో నడవలేక నడవలేక నిండు చూలాలులాగా వుంది.

ఆ లారీ సమాధిముందు ఆగింది. సమాధిమీద రంగురంగుల గాజుపలకలతో త్రికోణంగా పిరమిడ్‌ను తలపించే

కట్టడం తయారయింది. దానికి రక్షణగా చుట్టూ కట్టవలసిన రాతినిర్మాణం ప్రారంభమయింది.

గాజుపలకల త్రికోణంవైపు చూస్తూ రాళ్ళకు చేరగిలబడి నేలమీద కూర్చున్న ఆలీఖాన్ పిచ్చివాడులాగా వున్నాడు. కళ్ళు గుంటలుపడ్డాయి. తలరేగిపోయింది బట్టలు చిరిగిపోయాయి. తలకు సంస్కారంలేదు. కళ్లు నిద్రమత్తుగా వున్నాయి. ముక్కుపుటాలూ అధరాలూ అదురుతున్నాయి.

'నూర్జహాన్ !'

అస్పష్టంగా గొణిగాడు. కళ్ళవెంట అశ్రుపాతం ! ముఖంలో మార్పు శరీరం వణికింది.

సూర్యుడు నడినెత్తిమీద వున్నాడు. సంవత్సరంనుంచి అతన్ని ఎండగాని వానగాని తాకలేకపోయింది. అచలం లాగా వున్నాడు.

'వచ్చే ఆదివారంతో సంవత్సరం నిండిపోతుంది' నెమ్మదిగా గొణిగాడు.

పని పూర్తి అయ్యేట్లు కనిపించడం లేదు.

దగ్గరలోవున్న ఒక పూవుమీద రెండు తుమ్మెదలు వాలటానికి ప్రయత్నిస్తు న్నాయి.

అదిచూచి ఆలీఖాన్ స్తంభించి పోయాడు. రెండు కన్నీటి బిందువులు అప్రయత్నంగా జారి నేలమీదపడి మంటలో ఇంకిపోయాయి.

రంగుటద్దాల త్రికోణం దగ్గరకు పోయాడు.

సూర్యకిరణాలు పడి అద్దాలు మెరు స్తున్నాయి. అద్దాలలో తన ప్రతిబింబం కనబడుతూవుంది తన నీడలో ఎవరో కదిలినట్లయింది.

తనువు పులకించింది. హృదయంలో పాలవెల్లి పాలవెల్లిపై వెన్నెల !

'ఆలీ!'

ఎవరో పిలిచారు

అటూ ఇటూ చూశాడు. ఎవరూ కని పించలేదు అద్దంమీద తెల్లని పొగ !

'ఆలీ!'

పూవువంటి పొగ పిలిచింది సుకు మారస్వరం హృదయంలో ఆవేశం,

'నూర్జహాన్!' పెద్దగా అరిచాడు మెల్లగా ఉచ్చరించాడు. పొగ కదులుతూ వుంది. పొగ రూపుదాల్చింది. నూర్జహాన్ అయింది. మొగ్గల చిరునవ్వుతో తూలి పోయే లేత తీగలాగా వచ్చింది. ఆలీ ఖాన్‌ను ఆలింగనం చేసుకొంది,

ఆమె శరీరం చిగురుటాకులాగా వుంది. జుత్తు చిరుగాలిలాగా వుంది. కనులు మూసుకొన్నాడు; ఆమె చేతు ల్లోంచి జారిపోయింది. కల కరిగినట్లు అయింది. అమృతం జారినట్టుంది.

'నూర్జహాన్'

ఆలీ పిలిచాడు. ఆమె అద్దాల వెనుక నిలచిం .

వానాగాలీ వచ్చి ఉద్యానవనంలో పాము నంటుకొనివున్న తీగతెగి, గాలి క్రింద పడి గాలిలో తేలి, ఆ కాశంలో ప్రయాణంచేసి, నేలమీదపడి, ఆలీఖాన్ కాలికి చుట్టుకొంది. ఆ తీగను తీసుకు పోయి, తన పూదోటలో నాటుకొని తనే పందిరి అయి ప్రాణప్రదంగా పెంచు కొన్నాడు.

నూర్జహాన్ మరొక అద్దంలో వయా

**(5)**

రంగా నిలబడింది.

పూలపందిరిక్రింద జిలుగు జలతారు ముసుగు పరదాల లోపల సానబెట్టిన రత్నం కాంతులు వెదజల్లినట్లు అరవిరిసిన పూవు పరిమళం గుబాళించినట్లు. చంద్రబింబం లేతకౌముది కురిపించినట్లు విద్యుత్తులాగా ఉత్సాహంతో వెలిగి, పన్నీరులాగా శరీరంలోన ప్రవహించి, అమృతంలాగా అధరాలకు ఆనందం అందించింది.

నూర్జహాన్ మరొక అద్దంలో నవ్వుతూ వుంది.

పందిరమంచంమీద పూలమాలికల తెరలమధ్య వెలుగు కళికలాగా, జిలుగు నీలిరంగు దుప్పటిమధ్య మెరుపులాగా, తన తనువును వీణచేసుకొని స్వర్గంగా ధుని రసధ్వనులు ప్రవహింపజేసినట్లుగా సోలిపోయింది.

అందీ అందని అందాల ఆనందం లాగా ఆమె మరో అద్దంలో విలాసంగా నిలిచింది.

పచ్చని గరిక తివాసీమీద సెలయేటి ఒడ్డున స్వర్గం అరిచేతిలో దాచుకొన్న సుందర గంధర్వ భామినిలాగా ఆ లో గుండెలలోకి మెట్లుమెట్లుగా నడిచింది.

మేడమీద పూర్ణిమనాడు. వెన్నెల అంతా మూర్తిగొల్పిన సౌందర్యరాశి హస్తాలలో అలంకారంగా తొణికిసలాడె పానపాత్రలో యౌవ్వనం తొణికిసలాడే భామిని మధువు అందిస్తుంటే, వెన్నెలే కరిగి కంఠంలో ప్రవేశించినట్లున్న వేళ తనువు గాలిలో తేలుతున్న సమయాన, గాలిలో తేలిపోతున్నట్లు వచ్చి చేరిన అయిన ఆమెను తూలిపోతున్న చేతులలో తాకబోతే, మధిరామత్తత ముగియకముందే, మధిరామత్త నేత్రాలు మూతలుపడి, మధిరాహస్త మత్తరాశిని, మధిరా పాత్రలో ప్రాలి నేలమీద పడి పగిలిపోయింది.

'నూర్జహాన్' ఆలీఖాన్ బిగ్గరగా అరిచాడు. అద్దాల అంతర్యంలాగా, దర్పణాల వెనుకనుంచి, చిరుగజ్జెల సవ్వడులతో గా లోలేచి గలగలా వచ్చింది నూర్జహాన్.

పూల సువాసనను, వెన్నెల చల్లదనాన్ని, అద్దాల స్వచ్ఛతను ముట్టుకొన్నట్టు ఆమెను పట్టుకొన్నాడు ఆలీ. తన్మయత్వంతో అక్కడే అలాగే ఎంతోసేపు ఉండిపోయాడు.

'రాత్రి రాలేదు'

మేస్త్రీ చెప్పాడు.

ఆలీఖాన్ స్వప్నలోకంలోంచి ఈ లోకంలోకి వచ్చాడు. 'రాంకోటికి కబురు పంపలేదా' ప్రశ్నించాడు,

'పంపాను ఆయన అక్కడలేరు. ఇంటికి పోయారట.'

'సరే! ఆదివారానికి పూర్తికావాలి కట్టడం'

'రాత్రి సకాలంలో అందితే' అంటూ తల వూపాడు మేస్త్రీ.

'నేను రాంకోటి దగ్గరకు వెడుతున్నాను' ముందుకు నడిచాడు. చెట్టునీడలో వున్న కారెక్కాడు బయలుదేరింది. కారు విశాల భవనం ముందాగింది.

తలుపుదగ్గరకు పోయాడు ఆలీ. వేసివుంది తట్టాడు తలుపు తీయలేదు. తట్టాడు సమాధానం లేదు. 'రాంకోటీ రాంకోటీ' పిలిచాడు.

లోపల నన్నని కంఠం ఎవరో వచ్చారు. ఆయన్ను పిలుస్తున్నారు తేరని చెప్పు అనటం వినిపించింది.

ఏవో పాత జ్ఞాపకాలు తెరలు తొలగి లీలగా ఆ కంఠస్వరం వ్యక్తి గుర్తుకు వస్తూవుంది.

పనిమనిషి తలుపుతీసి 'వారులేరు' అని చెప్పేలోగా హాలుమధ్యలో పమిట చెంగు ముసుగు వేసుకొన్న మూర్తిని అవ్యక్తంగా చూచాడు. తలుపు పడింది.

ఆమె – ఆమె – ఎక్కడో చూచిన ట్లుందామెను. పూర్వజన్మమో. గతమో జ్ఞాపకం వచ్చివట్లుంది. మళ్ళీ తలుపు తట్టాడు.

తలుపు తెరుచుకొంది. వింతగా చూస్తున్న పనిమనిషిని గమనించకుండా లోపలికి వెళ్లాడు అలీ.

హాలులో పోతపోసిన విగ్రహంలా గున్న, ముసుగు కప్పుకొన్న ఆమెదగ్గరకు, పసిపిల్లవాడు చిందాడుతు వెళ్లినట్లు వెళ్ళాడు.

'నువ్వు ! నువ్వు ! నువ్వు !'

అటుతిరిగివున్న ఆమె ఆ స్వరంవిని ముఖంచూచి, 'ఆఁ !' అంది, వెండి కొంగ వెన్నెలమీద జారిపడ్డట్లు.

పొగమంచులోంచి కనిపించే ముఖం లాగా వుంది ఆమె ముఖం ముసుగు లోపట్నించి.

'నువ్వు సుజాతవుకదూ !'

ఆవేశంగా అడిగాడు అలీ.

'అవును !'

'నిజంగానా ? నిజంగానా సుజాతా ?'

'ఆఁ !'

'నువ్వు చనిపోలేదూ ?'

'లేదు !'

'అయితే నన్నెందుకు మోసంచేశావ్'

'నేనేమీ చేయలేదు'

'నువ్వు నదిలో కొట్టుకుపోలేదా !'

'ఆఁ !'

'మరి చనిపోలేదా ?'

నవ్వింది. 'రాంకోటి బ్రతికించాడు.'

'సుజాతా!'

దగ్గరకు పోబోయాడు.

'దూరంగా వుండు'

'సుజాతా!' బాధగా అరిచాడు.

'నేను పరాధీనను'

'కావచ్చు కావచ్చు సుజాత, నువ్వు నా దానివి.'

'ఒకప్పుడు. ఇప్పుడుకాదు వెళ్ళు!'

'అంతేనా ?'

అంతే !'

అలీ తలవంగిపోయింది. నెమ్మదిగా వెలుపలికి నడుస్తున్నాడు.

'అలీ !'

ఆగిపోయాడు.

'అలీ !'

ఆమె దగ్గరకు వచ్చింది.

'ఇప్పటికీ నిన్ను ప్రేమిస్తున్నాను'

'నిజంగానా ?'

'ఆఁ !– అయితే నేను రాంకోటి భార్యను'

ఆమె చరచరా లోపలికి పోయింది.

'సుజాతా !'

ఆమె వినిపించుకోలేదు. మెట్లు ఎక్కింది.

'సుజాతా !'

ఆమె వెళ్ళిపోయింది.

అలీ వెళ్ళాడు. మెట్లు ఎక్కాడు.

ఆమె ఏ గదిలోకి వెళ్ళిందో తెలియలేదు. వెదుకుతున్నాడు.

ప్రక్కగదిలో ఉల్లిపొరతెర చీరె చెరగులా కదులుతూవుంది. ఆలీ ఆగది లోకి పోయాడు.

దూరంగా వివస్త్రగా స్త్రీ!

నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు. ప్రశాంతంగా తెల్లని చాందినీ!

'సుజాతా!'

పిలిచాడు ఆమె వినలేదు. రెండడుగులు వేశాడు. ఆమె దూరంగా పోలేదు. దగ్గరకు పోయాడు. ఆమె సుజాతకాదు. అయితే! అయితే! ఆమె—ముఖంచూశాడు పరిచిత! బట్టలు కట్టుకోలేదు.

'నూర్జహాన్!'

అరిచాడు ఆమె తలవూపింది. సిగ్గుపడటంలేదు. నిర్ధతిగా వుంది.

'ఇక్కడెందుకున్నావ్?'

మాట్లాడలేదు కదలలేదు.

'చెప్పు! ఎందుకున్నావ్? చెప్పవేం?'

'చెప్పలేదు. కదలలేదు, గాలిపీల్చటం లేదు. నగ్నంగావుంది.

'చెప్పు!'

మృదువుగా తాకాడు, కఠినంగా, చల్లగా స్పర్శ.

'అది పాలరాతి బొమ్మ.'

వెలుపలనుంచి సన్నని కంఠస్వరం. ఆమె సుజాత!

'కాదు! కాదు! కాదు!—ఈమె నూర్జహాన్. నా నూర్జహాన్.'

'ఆ గదిలోంచి వెళ్ళిపోవాలి. రాంకోటి ఎవరినీ ఆ గదిలోకి రానివ్వడు. నేనూ వెళ్ళలేదు, ఎప్పుడూ బైటికి వెళుతూ తాళంవేసి వెళతాడు. ఇవాళ వేయలేదు. ఇవాళే మొదటిసారి అదవిలోకి నేను వెళ్ళాను బాధపడ్డాను. అయినా నేను రాంకోటి భార్యను. వెళ్ళిపోవాలి.'

ఆలీఖాన్ క్రుంగిపోయాడు.

'వెళ్ళ.'

'వెళ్ళాలా?'




'తప్పక'

'వస్తాను'

ఆలీఖాన్ ముఖంలో ద్వివిధ విచారం వల్ల ప్రేతకళ పడింది.

'ప్రేమించే హృదయం మరణించదు'

వెనుకనుంచి, ఉల్లిపొరతెర వెనుక నుంచి, ఉల్లిపొరవంటి ముసుగు వేసుకొన్న సుజాత చెబుతూ వుంది. ఆలీ మెల్లుదిగాడు. కళ్లనీళ్ళకుండలయ్యాయి.

హాలులోంచి వెళుతున్న ఆలీఖాన్ తలమీద పైనించి నీటిబొట్లు పడ్డాయి. పైకిచూస్తే కళ్లతుడుచుకొంటూ సుజాత.

కారులో లారీలు ఆగే పర్వత ప్రాంతంలోకి వచ్చాడు. 'రాంకోటీ! రాంకోటీ!'

లోయ ప్రతి ధ్వనించింది.

రెండు రోజుల్నుంచి కొండ పగల లేదు. డైనమైట్ అయిదుసార్లు పెట్టారు. చివరి ఆరోసారి ఎక్కువమందు పెట్టి దూరంగా కూర్చున్నారు క్వారీ జనం.

'రాంకోటీ!'

ఆలీఖాన్ లోయలోకి వచ్చాడు.

'రాంకోటీ!'

కేకలు పెడుతూ ప్రమాద ప్రాంతంలోకి వెళ్లాడు.

రాంకోటి ఆలీఖాన్‌ను చూస్తూనే వున్నాడు చెట్టు క్రిందనుంచి.

'పిలవకండి' ప్రక్కనున్నవాళ్ల సలహా ఇచ్చారు.

'పోనీండి. పిలవ్వద్దు'.

'ప్రమాదం జరగవచ్చు'

'చావనీండి!'

'రాయితోలిందబ్బు........'

'సమాధి కట్టటానికి నేను రాయి తొలిస్తూవుంది డబ్బు ఆశించికాదు డబ్బు నా కక్కరలేదు' నెమ్మదిగా అస్పష్టంగా చెప్పాడు. 'నా హృదయానికి శాంతి.'

డైనమైట్ పేలింది. కొండ పగిలింది రాళ్ళు పెళ్లలు పెళ్లలుగా ఆకాశంలోకి లేచాయి. మళ్ళీ పేలింది, పెద్ద రాతిపెళ్ళ లేచింది.

అది చూడగానే రాంకోటి గుండెలదరించాయి. అది వచ్చి చెట్టుమీద పడింది. రాయి పెళ్ళ నేలకు అతుక్కుపోయింది. రాంకోటి ఆఖరి ఘడియల్లో పెట్టిన చావుకేక 'ఆలీ' వినిపించింది కాని మనిషి కనిపించలేదు.

'రాంకోటీ!'

కేకలు పెడుతూ పిలుపు వినిపించిన దిక్కుకు పరుగెత్తాడు వికృతంగా రాంకోటి కనిపించాడు. బాధ కలిగింది. అచేతనంగా నిలబడ్డాడు.

మళ్ళీ కొండ పగిలింది. రాతి పెళ్ళ లేచింది. తిన్నగా వెళ్లి సమాధిమీద పడింది.

'నూర్జహాన్!'

లోయ ప్రతిధ్వనించింది. ఆకాశం మారుమ్రోగింది.

'ఆలీ!'

దూరంనుంచి పిలుపు చెట్లమధ్యగా వినిపించింది.

'నూర్జహాన్!'

సమాధి దగ్గరకు పరుగెత్తాడు.

'ఆలీ!'

సమాధి రంగుటద్దాలు పటపటాగా పగిలిపోయాయి. గుండె ముక్కలయి నట్టు విలవిల లాడాడు. సమాదిమీద రాయి, మూత పడింది.



జయశ్రీ

'అలీ !'

వెనుకనుంచి పిలుపు !

లేచి నిలబడ్డాడు వినిపించింది. వెనుకనుంచి ప్రతిధ్వని వెనక్కు చూశాడు.

'అలీ !'

'వస్తున్నా ! వస్తున్నా నూర్జహాన్ !'

వెనక్కు గబగబా చకచకబయలు దేరాడు. పరుగెత్తాడు.

'అలీ !'

ఎదురుగాపూలు ! పూలవెనుక పూవు వంటి స్త్రీ !


'ఎవరు నువ్వు ?'

'నేను !'

'అంటే ! ఎవరు నువ్వు ?'

"పోల్చుకోలేదా ?"

"లేదు ! నువ్వెందుకున్నా వికక్కడ ?"



"నీకోసం !"

"నాకోసమా ?"

దగ్గరకుపోయాడు.

"దూరంగావుండు !"

"ఎందుకు ?"

"ఎవర్ని నేను !"

"పోల్చుకొన్నాను. సుజాతవు !"

"అంతేకాదు ! పరస్త్రీని – పరాధీనను రాంకోటి భార్యను"

"ఎందుకొచ్చావేం"

"రాంకోటి చేయించుకొన్న నీ నూర్జహన్ పాలరాతి విగ్రహం నీకివ్వటానికి"

"ఇవ్వు !"

"నడూ !"

"ఎక్కడుంది ?"

"కారులో !"

ఇద్దరూ కారుదగ్గరకు నడుస్తున్నారు.

"రాంకోటి చనిపోయాడు"

ఆమె వణికిపోయింది. "ఎందుకు?" ప్రశ్నించింది. చెప్పాడు.

ఆమె వెనుదిరిగి పోబోయింది.

"ఆగు !"

"ఎందుకు ?"

"నా నూర్జహన్ విగ్రహం నాకివ్వు"

"ఇస్తాను"

ముందుకు నడుస్తున్నారు.

"సమాధి నాశనమయింది !"

"ఎందుకు ?"

"నీకే తెలియాలి !"

"ఎలా ?"

చెప్పాడు. ఆమె ఆగిపోయింది.

"నా నూర్జహన్ పాలరాతి విగ్రహం నా కివ్వు"

"ఇస్తాను!"

ఆమె ముందుకు నడిచింది.

"ఎందుకు తెచ్చావది"

"నీ కివ్వాలని"

"ఎందుకివ్వాలది నాకు !"

"నీది నీకు ఇవ్వాలి కాబట్టి"

"నీది నాకు ఇస్తావా ?"

"ఇస్తాను!"

కొండ పగిలింది. పెద్ద పెళ్ళలేచింది.

"కారులోవుంది తీసుకో !"

అలీఖాన్ సుజాత కారు దగ్గరకు పోయాడు. రాతిపెళ్ళ కారుమీద పడింది కారులోంచి విగ్రహం తలపగిలి నేల మీదపడింది.

"నూర్జహాన్ !"

గగ్గోలెత్తుతూ కేకలు పెట్టాడు.

'సుజాతా! నా నూర్జహాన్!'

'పగిలింది !'

'సుజాతా !'

'అలీ !'

'సుజాతా !'

'అలీ !'

'నా నూర్జహాన్ పాలరాతి విగ్రహం నా కివ్వు! ఇవ్వు సుజాతా!'

'ఇస్తాను ! ఇస్తాను అలీ ! నేనే ఇస్తాను! ఇస్తాను ఇప్పుడే ఇస్తాను.'

కథ చదవటం ముగించిన అక్తరు నిస్సావేగంకి హృదయం ఏమిటో, మొగటం ఏమిటో అర్థమయింది దగ్గరలో ప్రక్కనే కూర్చుని ఆమె కళ్ళలోకి చూస్తూవున్నాడు ఆదమ్స్.

దూరంగా చుక్కల అవతల అనంతంలోకి చూస్తున్నాడు సుందరరామశాస్త్రి.

★